‘నీలి నాలుక’తో జీవాలకు ముప్పు

- టీకాల ద్వారా వ్యాధి నివారణ
- వర్షాకాలంలో కాపరులు అప్రమత్తంగా ఉండాలి

గుంతకల్లు రూరల్: వర్షాకాలంలో దోమలవల్ల వ్యాపించే నీలినాలుక వ్యాధి వల్ల గొర్రెలు, మేకలకు ప్రాణహాని ఉందని పశువైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వర్షాకాలంలో దోమల వల్ల వ్యాపించే వైరస్ వల్ల ఏటా దాదాపు పదిశాతం గొర్రెలు, మేకలు మృత్యువాత పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. చాలా తక్కువ వ్యవధిలో ఒక గొర్రె నుంచి మరో గొర్రెకు వ్యాపించే ఈ వైరస్ సకాలంలో సరైన నివారణ చర్యలు పాటించకపోతే వందల కొద్దీ జీవాలను పొట్టన పెట్టుకునే ప్రమాదం ఉంది. కావున ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో గొర్రెల పెంపకందారులు ముందస్తు టీకాలను వేయించడంతోపాటు వ్యాధి సోకిన గొర్రెలకు సరైన చికిత్సను ఇస్తూ కాపాడుకోవాల్సి ఉంటుంది. నీలి నాలుక వ్యాధిని కలిగించే వైరస్‌ను అర్బీ వైరస్ అని పిలుస్తారు. ఈ వైరస్‌లో 24 వేరియంట్లు ఉండటం వల్ల వ్యాధి నివారణ టీకాలను తయారు చేయడం కూడా కష్టంగా మారిందని వైద్య నిపుణులు చెబుతున్నారు. క్యూలికాయిడిస్ అనే దోమ వల్ల వ్యాపించే ఈ వ్యాధి మందలో ఉన్న అన్ని గొర్రెలకు చాలా అనతి కాలంలోనే వ్యాపిస్తుంది. వ్యాధికి గురైన గొర్రెలను గుర్తించి వెంటనే వాటిని మంద నుంచి వేరు చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా వ్యాధి బారిన పడిన పొట్టేలు వీర్యం ద్వారా కూడా ఈ వ్యాధి ఇతర గొర్రెలకు వ్యాపిస్తుంది.


వ్యాధి బారిన పడకుండా పొట్టేలుకు టీకా వేస్తున్న దృశ్యం

నీలి నాలుక (బ్లూటంగ్) వ్యాధి లక్షణాలు

నీలి నాలుక వ్యాధి బారిన పడిన గొర్రెల్లో తీవ్రమైన జ్వరం 104 డిగ్రీల నుంచి 106 డిగ్రీల వరకూ ఉంటుంది. అలాగే వాటి నాలుక వాపు ఉండటమే కాకుండా లేత నీలి రంగులో కనిపిస్తుంది. పెదాలు, చిగుళ్లు, ముఖంలో కూడా వాపు కనిపిస్తుంది. ముక్కు, కన్ను నుంచి నీరు కారుతుంది. కాలి గిట్టల దగ్గర ఎర్రగా వాపు రావడంతో గొర్రెలు నడవడానికి కూడా వీలు కాక కుంటుతూ నడుస్తాయి. న్యుమోనియా లక్షణాలు ఉన్న గొర్రెల్లో శ్వాస తీసుకోవడం కూడా కష్టంగా మారుతుంది.

చికిత్స విధానం

వ్యాధి లక్షణాలు గుర్తించిన తక్షణమే దగ్గర్లోని పశువైద్యుడి సలహా మేరకు చికిత్స చేసుకోవాల్సి ఉంటుంది. వ్యాధి బారిన పడిన గొర్రెల నోటిలో వాపు, పుండ్లు ఉండటంతో అవి మేత మేయడానికి కూడా ఇబ్బంది పడుతాయి. కావున సులభంగా జీర్ణమయ్యే గంజి లాంటి ఆహార పదార్థాలను కొద్దిగా ఉప్పు కలిపి తాగించాలి. అందులో ఓఆర్ఎస్ వంటి ద్రావణాలను కలిపి వ్యాధి తగ్గేవరకూ తాగించాలి. జ్వరం తగ్గడానికి మెలోక్సికమ్ లేదా అనాల్జిన్ వంటి మందులను వాడాలి. సెకండరీ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ ఉన్నట్లయితే యాంటీబయాటిక్ మందులను కూడా వాడాలి. న్యుమోనియా లక్షణాలు ఉన్నట్లెతై అవిల్, సీపీఎం వంటి మందులను వాడాల్సి ఉంటుంది.

వ్యాధి నివారణ

గొర్రెలు, మేకలు నీలిక నాలుక వ్యాధి బారిన పడకుండా నివారించడానికి క్రమం తప్పకుండా బ్లూటంగ్ వ్యాక్సిన్ వేయించాల్సి ఉంటుంది. మూడు నెలలు పైబడిన గొర్రె పిల్లలకు 2 ఎంఎల్ చొప్పున మొదటి టీకా వేయించాలి. మళ్లీ 21 రోజులుకు బూస్టర్ టీకా వేయించాలి. అక్కడ నుంచిప్రతి సంవత్సరం ఆగస్టు – అక్టోబర్ మధ్య కాలంలో టీకాను క్రమం తప్పకుండా వేయించాలి. గొర్రెల మందను నిలిపే పాకలో దోమలు వ్యాపించకుండా దోమ తెరలు కట్టాలి లేదా వేపాకు పొగను వేయాలి.

పెంపకందారులు జాగ్రత్తగా ఉండాలి



ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం అయిన నేపథ్యంలో గొర్రెల పెంపకందారులు అప్రమత్తంగా ఉంటూ వ్యాధుల బారిన పడకుండా జీవాలను జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఎప్పటికప్పుడు మందలోని గొర్రెల ఆరోగ్యాన్ని కనిపెట్టుకుని ఉండాలి. నీలి నాలుక వ్యాధితో పాటు ఏ ఇతర జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే నాగసముద్రంలోని పశువైద్య కేంద్రాన్ని సంప్రదించండి.

– మహేష్, మండల పశువైద్యాధికారి

పరామర్శ


చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య

అనంతపురం కార్పొరేషన్: బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఆదిలక్ష్మి కుటుంబంపై టీడీపీ నాయకులు వేట కొడవళ్లతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. దాడికి గల కారణాలపై ఆరా తీశారు. భయపడాల్సిన పని లేదని వారిలో ధైర్యాన్ని నింపారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, గెలుపోటములు సహజమన్నారు. ఈ ఘటనను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లామని పైలా తెలిపారు.

క్లుప్తంగా

బటర్ ఫ్లై స్తంభాలు ఏర్పాటు చేయండి


కూలిన పోల్‌ను రోడ్డు పక్కన పడేసిన దృశ్యం

గుత్తి: పట్టణంలోని రవి తేజ హోటల్ వద్ద నుంచి ఆర్ఎస్ వరకూ రోడ్డు డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేసిన బటర్ ఫ్లై విద్యుత్ స్తంభాలు సుమారు 10 కూలిపోయాయి. కొన్ని లారీలు , ఇతర వాహనాలు ఢీ కొనగా కూలిపోగా, మరి కొన్ని నాసిరకం కావడంతో కూలిపోయాయి. అయితే కూలిపోయిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి వేళల్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి స్తంభాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరగకుండా చూడండి


రోడ్డుకు అడ్డంగా ఉన్న మొద్దు

యల్లనూరు: రాత్రి సమయాల్లో రోడ్డుకు అడ్డంగా ఉన్న మొద్దు ప్రమాదాలకు నిలయంగా మారుతుంది. ఎన్జే కాల్వ రోడ్డులో యల్లనూరు-1 సచివాలయానికి వెళ్లె దారిలో ప్రధాన రోడ్డుకు అడ్డంగా టెంకాయచెట్టు నరికిన మొద్దు ఉంది. దీంతో రాత్రి పూట ప్రమాదాలు జరుగే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉన్న మొద్దును తొలగించి ప్రమాదాలు జరగకుండా కాపాడాలని కోరారు.

బైక్, ఆటో ఢీ - ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని కర్నూలు రోడ్డు పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం బైక్, ఆటో ఢీ కొన్నాయి. ఘటనలో విష్ణు, రఘు అనే ఇద్దరు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. గుత్తికి చెందిన వారు బైక్‌లో వ్యాపిలికి వెర్తుడగా ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొన్నారు. గాయపడిన ఇద్దరినీ స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆలయం వద్ద అన్నదానం

పుట్లూరు: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. 36 వారాలుగా దాతల సాయంతో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో దాతలు ఓబులేసు, నాగేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

‘టెండర్ రూట్స్’కు జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న కరస్పాండెంట్ వసుంధర

గుంతకల్లుటౌన్: పట్టణంలోని తిలక్‌నగర్‌లో ఉన్న టెండర్ రూట్స్ ప్రీ స్కూల్‌కు ఉత్తమ ప్రీ స్కూల్-2024 అవార్డు లభించింది. ఆదివారం బెంగళూరులో ఎన్ఎస్ఏ (నేషనల్ స్కూల్ అవార్డు-2024)ల ప్రదానోత్సవ కార్యక్రమంలో కరస్పాండెంట్ బి.వసుంధర అవార్డును అందుకున్నారు. చిన్నారులకు ఆహ్లాదకర వాతావరణం, ఆధునిక విద్యా పద్ధతుల్లో బోధిస్తున్నందుకు తమ స్కూల్‌కు జాతీయ స్థాయి అవార్డు లభించిందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

దోణరామేశ్వరాలయంలో పూజలు


అలంకరణలో దోణరామేశ్వరుడు

శింగనమల: మండలంలోని చిన్నజలాలపురంలో ఉన్న దోణరామేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఆదేవిధంగా శింగనమలలోని నీలకంఠేశ్వర ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

బీఎస్ఎన్ఎల్‌తో గేట్స్ కళాశాల ఎంఓయూ

గుత్తి: పట్టణంలోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీతో బీఎస్ఎన్ఎల్ సంస్థ సోమవారం ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ సందర్భంగా గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ఎంఓయూ వల్ల ఇంజనీరింగ్ విద్యార్థులకు చాలా ఉపయోగాలున్నాయన్నారు. ఈసీఈ, సీఎస్ఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఈఈఈ, మిషిన్ లెర్నింగ్, ఐఓటీ టెక్నాలజీలపై పనిచేసే వెసులుబాటు లభిస్తుందన్నారు. విద్యార్థులకు సంబంధిత ఫీల్డ్‌లో మంచి ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ ముజీబ్ పాషా మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ ట్రెయినింగ్ పాయింట్ ద్వారా విద్యార్థులకు ఎల్‌టీఈ, 4జీ, 5జీ టెక్నాలజీలపై శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థులు బీఎస్ఎన్ఎల్ సంస్థలో ఇండస్ట్రియల్ విజిట్, సర్టిఫికేషన్ కోర్సులు, ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టులు చేసుకునేందుకు వీలు పడుతుందన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ప్రతినిధులు బాలగంగాధర్‌రెడ్డి, బాలాజీ, బాబా ఫక్రుద్దీన్, గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ప్రిన్సిపాల్ సురయ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తన్వీర్ తదితరులు పాల్గొన్నారు.


గేట్స్‌తో ఎంఓయూ కుదుర్చుకుంటున్న బీఎస్ఎన్ఎల్ సంస్థ ప్రతినిధులు

గ్రామానికి రేషన్ షాపు కేటాయించాలి


పుట్లూరు: తహసీల్దార్ మల్లికార్జునస్వామికి వినతిపత్రం అందజేస్తున్న నాయకునిపల్లి ప్రజలు


బుక్కరాయసముద్రం: వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పుట్లూరు: మండలంలోని నాయకునిపల్లి గ్రామానికి రేషన్‌షాపును కేటాయించాలని ఆ గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు కోరారు. సోమవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మల్లికార్జునస్వామికి వినతిపత్రం అందించారు. ప్రతి నెలా రేషన్ సరుకుల కోసం మండలకేంద్రానికి రావాల్సి వస్తోందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే గ్రామానికి రేషన్ షాపు కేటాయించాలన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తామన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ఇందిరా గాంధీనగర్, న్యూ ఎస్సీ కాలనీ, గౌరయ్య కాలనీలో లోఓల్టేజ్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్లప్ప డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రీవెన్స్ కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంత నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. నల్లప్ప మాట్లాడుతూ విద్యుత్ సమస్యపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అలాగే మండల కేంద్రంలో జరుగుతున్న గ్రీవెన్స్‌కు విద్యుత్ అధికారులు రాకపోవడంపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు వినతులు

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం ఫిర్యాదుల కార్యక్రమానికి ప్రజల నుంచి నాలుగు వినతులు అందినట్లు తహసీల్దార్ భారతి తెలిపారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పింఛన్ మంజూరు చేయాలని ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఓ మిత్రవింద మాధవి, ఏఓ ముస్తాక్ అహ్మద్, సబ్‌రిజిస్ట్రార్ గురునాథ్, ఇరిగేషన్ ఏఈ గురుప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి పాల్గొన్నారు.

రెండు వినతులు

యల్లనూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో రెండు అర్జీలు వచ్చాయని తహసీల్దారు జయప్రసాద్ తెలిపారు. భూమి కోసం ఒకటి, జనన ధ్రువీకరణ పత్రం కోసం ఒకటి దరఖాస్తు అందజేశారన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుప్రజారెడ్డి, ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు, ఏపీఓ షబ్బీర్‌బాషా, పీఆర్ జేఈ నరేంద్ర, ఈసీ బబ్లు, వార్డెన్ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ సుప్రజారెడ్డి, ఎంఈఓ పరమేశ్వరరెడ్డి, వైద్యుడు శివసాయి తదితరులు పాల్గొన్నారు.

లోక రక్షకుడు ‘క్రీస్తు’

పామిడి: సర్వమానవ పాపపరిహారార్థం ఈలోకానికి విచ్చేసిన క్రీస్తు లోక రక్షకుడని దైవ జనులు, గుంటూరు యూదా మినిస్ట్రీ పాస్టర్ కే నెహమ్యా అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక శాశ్వత కృప మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వరుసగా మూడురోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య ప్రసంగీకులుగా విచ్చేశారు. ముందుగా అందరికీ రక్షణ శుభవార్త సభలను ప్రార్థనతో ప్రారంభించారు. ఈసందర్భంగా సింగింగ్ క్వయర్ టీమ్ ఆలపించిన దైవ సంకీర్తనాలాపనలు శ్రోతలను రంజింపజేశాయి. అనంతరం ప్రేమవిందు ఏర్పాటు చేశారు.

నారాయణ కళాశాలను సీజ్ చేయాలి


ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న నారాయణ కళాశాలను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం ఆర్డీఓ, ఎంఈఓ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి వెంకీ ఇతర నాయకులు మాట్లాడుతూ పాఠశాల పేరుతో ముద్రించిన పాఠ్యపుస్తకాలను నారాయణ కళాశాలలో విక్రయిస్తున్నారన్నారు. నారాయణ కళాశాల యాజమాన్యం పుస్తకాలు, యూనిఫాం పేరుతో తల్లిదండ్రుల నుంచి వేలల్లో డబ్బు గుంజుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం వారు దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్కూల్ దారులను పునరుద్ధరించండి

గుంతకల్లుటౌన్: స్థానిక ఆర్అండ్‌బీ సర్కిల్ పోర్టర్స్ లైన్ వరకూ రైల్వే క్వార్టర్స్ మీదుగా స్కూళ్లు, రైల్వే హాస్పిటల్‌కు వెళ్లేందుకు వీల్లేకుండా నిర్మించిన ప్రహరీ లను తొలగించాలని ఏడీఆర్ఎం సుధాకర్‌ను సీపీఎం నాయకులు కోరారు. సోమవారం ఏడీఆర్ఎంను సీపీఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, నాయకులు కలసి వినతిపత్రం అందజేశారు. ప్రహరీ తొలగించి యథావిధిగా దారులను పునరుద్ధరించాలని వారు కోరారు. సీపీఎం నాయకులు డి.శ్రీనివాసులు, మారుతి, దాసరి శీనా, రమేష్, నాగరాజు, తిమ్మప్ప, జగ్గిలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేయాలి


తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏపీ రైతుసంఘం నాయకులు


గుత్తిలో తహసీల్దార్ భారతికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: ప్రభుత్వం ప్రకటించిన 20వేల పెట్టుబడుల సాయాన్ని వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఏపీ రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు.సోమవారం ఏపీ రైతు సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఖరీఫ్, రబీలో పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు పంటల బీమా ప్రకటించి ఆదుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: ప్రభుత్వం రైతులకు ప్రకటించిన రూ.20వేలు పెట్టుబడి సాయం వెంటనే ఖాతాల్లో జమచేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం నాయకులు తహసీల్దార్ భారతికి వినతి పత్రం అందజేశారు. ఏపీ రైతు సంఘం నాయకులు నిర్మల, మల్లికార్జున మాట్లాడుతూ 2023 ఖరీఫ్‌లో జిల్లాలోని 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినా కరువు నివారణకు ప్రత్యేక నిధులను కేటాయించలేదన్నారు కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మల్లేష్, చిన్నమారెన్న పాల్గొన్నారు.

పుట్లూరు: ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఏఓ కాత్యాయనికి వారు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటచౌదరి, నాయకులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతులకు వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి, నాయకులు కుళ్ళాయప్ప, పెద్దన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే లో తహసీల్దార్ శేషారామ్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పెద్దవీరన్న, వీరన్నపల్లి ఓబిలేసు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం వెంటనే రైతులకు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా మెంబరు భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పుల్లన్న, రుషింగప్ప, ఓబిలేసు, శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘నేను బడికి పోతా’పై ర్యాలీ

యాడికి: యాడికి మండల కేంద్రంతో పాటు రాయల చెరువు గ్రామంలో ఎంఈఓలు కాశప్ప, ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ‘నేను బడికి పోతా’ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలని, పనుల్లో ఉండకూడదన్నారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను బడుల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం డేనియల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడిలోకి పిల్లలను చేర్పించండి

శింగనమల: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బయ్య తెలిపారు. సోమవారం మండలంలోని సోదనపల్లిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ఉన్నాయని, ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన విద్యాబోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.


యాడికి మండలం రాయలచెరువులో ర్యాలీ చేస్తున్న దృశ్యం

డయేరియాపై అప్రమత్తంగా ఉందాం


బుక్కరాయసముద్రంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శోభారాణి


గార్లదిన్నె మోడల్ స్కూల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం


పెద్దపప్పూరు మండలం దేవుని ఉప్పలపాడులో డ్రైనేజీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కవిత

బుక్కరాయసముద్రం: డయేరియాపై ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ సునీత, ఎంపీడీఓ శోభారాణి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డయేరియాపై మండలస్థాయి ఇంటర్ సెక్టోరల్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ డయేరియాపై జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకూ ఇంటింటా సర్వే చేపట్టాలన్నారు. అలాగే గ్రామాల్లో అవగాహన సదస్సులు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నవిద, డాక్టర్ స్వాతి లక్ష్మి, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఇందిరా ప్రియదర్శిని, సీహెచ్ఓ మోహన్ రావు, మోహన్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జనార్దన్, పీహెచ్ఎన్ చెన్నమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత, అన్నపూర్ణ, నాగమణి, ధనుంజయ, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డయేరియా వ్యాధిపై సోమవారం మండల స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది దోమలు ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గౌతమి, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, ముస్లిం మైనార్టీ పాఠశాల హాస్టల్లో సోమవారం మలేరియా ఉప విభాగం ఆధ్వర్యంలో దోమల నివారణకు వైద్య సిబ్బంది మలథియాన్ పొడి పిచికారీ చేశారు. మలేరియా ఉపవిభాగం పర్యవేక్షకుడు మద్దయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, సీహెచ్ఓ లోక్‌నాథ్, నూరుభాషా, హెల్త్ సూపర్ వైజర్లు విశ్వనాథ్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: డయేరియా కేసులు ప్రబలకుండా అందుబాటులో ఉండి వైద్య సేవలందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ కవిత ఆరోగ్యసిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని దేవుని ఉప్పలపాడు గ్రామాన్ని ఆమె సందర్శించి డయేరియా సోకిన వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని డ్రైనేజీ కాలువల్లో సున్నపు పొడి,బ్లీచింగ్ పౌడర్ చల్లించడంతో పాటు కలుషితమైన నీరు, ఆహారం తీసుకోకూడదని గ్రామస్తులకు అవగహన కల్గించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేంద్రర్ రెడ్డి , హెల్త్ సూపర్‌వేజర్ శర్మాస్‌వలి , ఈఓఆర్‌డీ కమలాబాయి,ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువులు, మందుల వివరాలు తెలపాలి

గార్లదిన్నె: మండలంలో ఉన్న ఫర్టిలైజర్ షాపుల్లో ఎరువుల ధరల పట్టిక, ఎరువులు, మందులు వివరాలు నోటీస్ బోర్డులో పెట్టాలని రాయలసీమ రైతు సంఘం నాయకులు అక్బర్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపులో నోటీస్ బోర్డులు ఏర్పాటు చేసి వివరాలు నమోదు చేయాలన్నారు. అలాగే రైతులకు నాణ్యమైన ఎరువులు , మందులు విక్రయించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏఓ సోమశేఖర్‌కు అందజేశారు. ఆ సంఘం నాయకుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.